## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని టౌన్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ వై.విజయానంద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చోడవరం బైపాస్ రోడ్డు, అరికిరేవుల నరసరావుపేట మెయిన్ రోడ్డు నుంచి చేపల చెరువుల వరకు, విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయటం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

### లక్ష్యాల నిర్దేశంతో మానసిక ఆందోళన



మండపేటలో సమావేశమైన పోస్టల్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): పోస్టల్ శాఖలో వ్యాపారాభివృద్ధి కోసమంటూ నిర్దేశిస్తున్న లక్ష్యాలు తమను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయని తపాలా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మండపేటలో సోమవారం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రామచంద్రపురం బ్రాంచ్ పరిధిలోని తపాలా ఉద్యోగులు సమావేశమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బి.వీరయ్య చౌదరి అధ్యక్షత వహించారు. కార్యదర్శి ఎస్‌వీవీ మునేశ్వరరావు, కోశాధికారి వై.కామేశ్వరి మాట్లాడుతూ ఉద్యోగుల సమ్మె అనంతర పరిణామాలను సభ్యులకు వివరించారు. ఉద్యోగులంతా ఐక్యంగా సమస్యలపై ఉద్యమించాలన్నారు. కోశాధికారి వై.కామేశ్వరి మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్న తమకు బలవంతపు లక్ష్యాలను నిర్దేశించడం బాధాకరమన్నారు. అలాగే పిల్లా నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణస్వామి, జీవీ ప్రసాద్, జి.రామకృష్ణ చౌదరి, సత్యనారాయణమూర్తి, కె.రామబ్రహ్మం, గట్టి వెంకటేశ్వరరావు, ఎం.విజయ్ మాట్లాడారు. సమావేశంలో అంగర, కపిలేశ్వరపురం, చింతలూరు, ఏడిద, తాపేశ్వరం, అనపర్తి, ద్రాక్షారామ, రామచంద్రపురం ఓల్డ్, పట్టణ, గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

### గ్రేడ్-5 కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించాలి

రామచంద్రపురం రూరల్: గ్రామ స్వరాజ్యం అమలును పటిష్టం చేసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 11 త్వరితగతిన అమలు చేసి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించేలా చూడాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఆయన ఇంటి వద్ద కలసి కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రభుత్వ పాలనను గ్రామ స్థాయికి తెస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, సిబ్బంది మరింత పటిష్టమయ్యేలా ప్రతి 500 పైబడిన జనాభాకు ఒక పంచాయతీ కార్యదర్శి ఉండేలా విడుదల చేసిన జీఓతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అందుకు తామంతా అంకిత భావంతో పనిచేస్తామని తెలిపారు. ఈమేరకు ఎంపీ బోస్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంపీ బోస్ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ప్రసాదరెడ్డి, లక్ష్మణరావు, స్వెత్లానా షరీఫ్, దుర్గాప్రసాద్, షేక్ జహంగీర్, శివ ఇషాంత్, కోడి పండు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేన్సర్ బాధిత విద్యార్థికి రూ.1.15 లక్షల సాయం



బాధిత విద్యార్థి బంధువులకు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కేన్సర్ బాధిత విద్యార్థి అల్లం నిరంజన్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.1.15 లక్షలు సేకరించి సోమవారం బంధువులకు అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. వెల్ల శివారు వెల్లసావరానికి చెందిన అల్లం రవి కుమార్ చేనేత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమారుడు నిరంజన్‌కుమార్‌కు అస్వస్థత కలగడంతో ఈ నెల 5న స్థానిక పీహెచ్‌సీలోను, అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలోను, కాకినాడ సిద్ధార్థ ఆసుపత్రిలోనూ చూపించారు. బ్లడ్ కేన్సర్ అని తేలింది. దీంతో ఈ నెల 15న అనకాపల్లి సమీపాన అగనంపూడి టాటా కేన్సర్ ఆసుపత్రిలో చేర్చి వెంటిలేటర్‌పై వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ.5 లక్షల వరకు వైద్యం నిమిత్తం ఖర్చు కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని పాఠశాల ఉపాధ్యాయులు రూ.50 వేలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర సంస్థల సహకారంతో రూ.65 వేలు సేకరించి ఇన్‌చార్జి హెచ్‌ఎం కేవీవీ సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా బాధిత విద్యార్థి పెదనాన్న, చిన్నాన్నలకు ఆ సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాజా మొహిద్దీన్, పాకలపాటి శ్రీనివాసరావు, అళ్ల అమ్మాజీ, సీహెచ్ అరుణకుమారి, ఎం.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం దిశగా..



పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

- గ్రామాల్లో ఊపందుకున్న పన్నుల వసూళ్లు
- శత శాతం కోసం శ్రమిస్తున్న కార్యదర్శులు
- డివిజన్ పరిధిలో రూ.11.20 కోట్ల లక్ష్యం
- ఇప్పటి వరకు 51 శాతం వసూళ్లు

రాయవరం: గ్రామ పంచాయతీలు పన్నుల వసూళ్ల లక్ష్యం దిశగా సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 40 రోజులు గడువు మాత్రమే ఉండడంతో శత శాతం పన్నుల వసూళ్లకు పంచాయతీ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు 51 శాతం పైబడి వసూలు చేయగా, మిగిలిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో ఉదయం నుంచే రిజిస్టర్లు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు.

**క్లస్టర్ పరిధిలో పరిస్థితి...**

రామచంద్రపురం డివిజన్ పరిధిలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలున్నాయి. డివిజన్ పరిధిలో 94 పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.11,20,21,042 పన్ను వసూళ్లు లక్ష్యంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ వరకూ రూ.5,73,30,381 వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5,46,90,661 వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి 51 శాతం పన్ను వసూళ్లు చేపట్టారు. మార్చి నెలాఖరుకు శత శాతం పన్ను వసూళ్ల లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. అలాగే మొండి బకాయిలపై ప్రత్యేక దష్టి సారించి వాటి వసూళ్లే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

**రామచంద్రపురం డివిజన్ పరిధిలో పన్ను వసూళ్లు**

| మండలం | పంచాయతీలు | డిమాండ్ | వసూళ్లు |
|---|---|---|---|
| కపిలేశ్వరపురం | 19 | రూ.1,32,18,122 | రూ. 91,07,419 |
| మండపేట | 12 | రూ.4,71,10,353 | రూ. 2,04,98,774 |
| రాయవరం | 12 | రూ.2,10,11,059 | రూ. 1,31,74,118 |
| కె.గంగవరం | 26 | రూ.1,09,06,229 | రూ. 49,98,130 |
| రామచంద్రపురం | 25 | రూ.1,97,75,279 | రూ. 95,51,940 |

**కపిలేశ్వరపురం టాప్.. మండపేట లాస్ట్**

పన్నుల వసూళ్లలో మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం మండలం 69 శాతం, మండపేటలో 44 శాతం, రాయవరం మండలంలో 63 శాతం వసూళ్లు చేపట్టారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 46 శాతం, రామచంద్రపురం మండలంలో 48 శాతం మేర వసూళ్లు చేపట్టారు. డివిజన్ పరిధిలో 69 శాతం వసూళ్లతో కపిలేశ్వరపురం మండలం ప్రథమ స్థానంలో నిలవగా, 44 శాతం వసూళ్లతో మండపేట మండలం చివరి స్థానంలో ఉంది. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు.

**నూరు శాతం వసూలుకు కృషి**



పంచాయతీల పరిధిలో పన్ను వసూళ్ల ముమ్మరంగా చేపడుతున్నాం. నూరు శాతం పన్ను వసూళ్ల చేసేందుకు కృషి చేస్తున్నాం. మొండి బకాయిలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. లక్ష్యాల మేరకు పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం.

– పి.వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి, రాయవరం

**సిబ్బందికి సహకరించాలి**



డివిజన్ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి తదనుగుణంగా పనిచేయడంతోనే ఇప్పటి వరకు 51 శాతం వసూలు చేయడం జరిగింది. మార్చి మాసాంతానికి మిగిలిన లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకుంటాం. ప్రజలు పన్ను వసూళ్లు చేయడానికి వచ్చే సిబ్బందికి సహకరించాలి.

– ఎం.రామకష్ణారెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి, రామచంద్రపురం

### ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



గొల్లపాలెం వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలకు దూరంగా ఉండగలుగుతాడని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని గొల్లపాలెంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గత నాలుగు రోజులుగా జరుగుతున్నాయి. సోమవారం ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితర నేతలు పాల్గొని గణపతి హోమం, సంప్రోక్షణ తదితర కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భగవంతునిపై భక్తిభావాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, నిమ్మితి విజయ్, టేకుమూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీతోనే పేదలకు మేలు



పార్టీలో చేరిన వారితో పృథ్వీరాజ్, శ్రీకృష్ణ, సత్యకృష్ణ

**పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్**

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోనే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, వార్డు కౌన్సిలర్ సవరపు సతీష్‌ల ఆధ్వర్యంలో చింతపర్తి హరీష్ ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా మండపేట పట్టణంలోని 7వ వార్డుకు చెందిన 70 మంది యువకులు వైసీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పృథ్వీరాజ్ సాదరంగా ఆహ్వానించారు. పార్టీ పట్ల ఆకర్షితులైన చింతపర్తి హరీష్ సేవలు పేదలకు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. పార్టీ జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షుడు చోడే సత్యకృష్ణ, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి శ్రీకృష్ణ మాట్లాడుతూ యువతకు వైఎస్సార్ సీపీతోనే మేలుకు జరుగుతుందన్నారు. మండపేట నియోజకవర్గంలో విద్య, వైద్యం రంగాల అభివృద్ధికి శ్రమిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు నివాసితులు పాల్గొన్నారు.

## సంక్షేమం కోసం మళ్లీ జగనే సీఎం కావాలి

కాజులూరు: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. సోమవారం మండలంలోని చీకట్ల వారిపేట, ఊడావారిపేట, బందనపూడి, మతుకుమిల్లి తదితర గ్రామాల్లో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. మంజేరులో ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరుశాతం అమలు చేయడంతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని సగటున ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. పార్టీ విజయాలకు కార్యకర్తలు, నాయకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు, జొన్నకూటి వెంకటేశ్వర్రావు, బొల్లంగి వెంకన్న, కాకి కృష్ణ, శ్రీరామ్, కట్టా శేఖర్, కాదా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మతుకుమిల్లిలో కార్యకర్తలు, ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎంపీ సుభాష్‌చంద్రబోస్

## వలంటీర్ల సేవలు అభినందనీయం

**ఎంపీ పిల్లి బోస్**

కె.గంగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారి సేవలు అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలకేంద్రమైన కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వారిని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌తో కలసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టడం ఎంతో ప్రతిష్టాత్మకమన్నారు. వారికి కేటాయించిన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారికి ప్రభుత్వ విధానాలను వివరించడంతో వలంటీర్లు ముందున్నారన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో కూడా ప్రాణాలు సైతం పక్కన పెట్టి ప్రజలకు మేలు చేశారన్నారు. కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీరుస్తూ సేవకోసం నిరంత్రం శ్రమిస్తున్న వలంటీర్‌కు వందనమన్నారు. వారి సేవల వల్లే పాలన కొంత వరకు సులువైందన్నారు. రానున్న కాలంలో కూడా వలంటీర్ సేవలు ఉండాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ఇప్పటి నుంచే పతి ఒక్క వలంటీర్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం**

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో రామచంద్రపురం మండల వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సోమవారం సూర్యప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు ఎనలేనివని అన్నారు. మండలంలో సేవావజ్ర అవార్డు పొందిన తాళ్లపాలెం వలంటీర్ వల్లు దుర్గ, ఏరుపల్లి వలంటీర్ కామన సులోచన, సేవారత్న అవార్డు పొందిన వేగాయమ్మపేట వలంటీర్ కట్టా నాగదేవి లలిత, నెలపర్తిపాడు ఈతకోట శివ, కందులపాలెం జిల్లెల్ల చినరాణి, ద్రాక్షారామ-1 మహమ్మద్ అమర్‌జహర, జగన్నాయకులపాలెం భూమాడి నాగమణిలను సేవామిత్ర అవార్డులు పొందిన 451 మందిని సత్కరించి సర్టిఫికెట్‌లు, నగదు ప్రోత్సాహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఎంపీటీసీలు పరమటి జ్ఞానలక్ష్మి, పంపన ఏడుకొండలు, రెడ్నం సతీష్, సర్పంచ్‌లు పిల్లి అచలరాజశ్రీ, కట్టా గోవిందు, పెమ్మిరెడ్డి దొరబాబు, యల్లమిల్లి సతీష్‌కుమారి, వీరబోయిన సూరిబాబు, అంబటి తుకారం తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో సేవా రత్న వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

## ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి సోమవారం వైఎస్సార్‌సీపీ రామచంద్రపురం కోర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతర వేదపండితుల మంత్రాల మధ్య పార్టీ ప్రచార రథాలను ప్రారంభించారు. అనంతరం కోటిపల్లి నుంచి కె.గంగవరం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు. కె.గంగవరం ప్రధాన సెంటర్లో కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ మరో 55 రోజుల్లో ఎన్నికలు ఉన్నందును వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించి ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ప్రచారం ప్రారంభించాలన్నారు. నేటి నుంచి ఎన్నికల వరకు ప్రచారం జరుగుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, సర్పంచ్ సత్యానందం, నాయకులు చిట్టూరి చిన్ని, బీసీ నాయకులు పంపన సుబ్బారావు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నేడు పట్టణంలో గడప గడపకూ..

రామచంద్రపురం: పట్టణంలోని 7వ సచివాలయం పరిధి చప్పిడివారిసావరం 14వ వార్డు వినాయకగుడి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిలు ముఖ్యఅతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, కో ఆప్షన్‌సభ్యులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

### అదనపు కట్నం వేధింపుల కేసులో ఏడాది జైలు

అయినవిల్లి: అదనపు కట్నం వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అమలాపురం పీడీఎం కోర్టు జడ్జి ఉమాగౌరీ శంకర్ తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం యలమించిలి పోతురెడ్డిపాలెంకు చెందిన పెమ్మనబోయిన విష్ణు వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు)కు నేదునూరుకు చెందిన సత్యనాగవేణికి పెద్దల సమక్షంలో 2011లో వివాహం అయింది. వీరికి ఒక బాబు ఉన్నారు. వివాహ సమయంలో రూ.3 లక్షలు కట్నం, ఎకరం అరవై సెంట్ల భూమి, 10 కాసుల బంగారం, ఒక కేజీ వెండి ముట్టజెప్పారన్నారు. పెండ్లి అయిన ఏడాది తర్వాత రూ.లక్ష అదనంగా కట్నం తెమ్మని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. దీనిపై అప్పటి ఎస్సై డి.దుర్గాశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముద్దాయి పెమ్మనబోయిన విష్ణు వీవీ సత్యనారాయణ(సత్తిబాబు)పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అమలాపురం పీడీఎం కోర్టు జడ్జి ఉమా గౌరీశంకర్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు. ఏపీపీ రాజశేఖర్ ఈ కేసును వాదించారు.

### వాడపల్లి వెంకన్న ఆభరణాల తనిఖీ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి బంగారం, వెండి ఆభరణాలను దేవదాయ శాఖ ఉప కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ తనిఖీ నిర్వహించారు. ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ సమక్షంలో తనిఖీలు నిర్వహించారు.

## వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రాయవరంలో నిర్వహిస్తున్న శ్రీవారి కల్యాణం



అంగరలోని స్వామి నక్షత్ర కల్యాణం

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చక బృందం సభ్యులు స్వామిని విశేషంగా అలంకరించారు. కల్యాణ మూర్తులకు తిరుమంజన సేవ, విశేష పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ మంగళవారం స్వామి కల్యాణం, ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

**రాయవరంలో...**

రాయవరం: రాయవరంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నక్షత్ర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా శ్రీవారికి నిర్వహించే నక్షత్ర కల్యాణంలో భాగంగా మృగశిర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంగర అయ్యమాచార్యుల పర్యవేక్షణలో అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు, అంగర శోభనాద్రాచార్యులు, అంగర లక్ష్మీనారాయణాచార్యులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, మహేంద్రవాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

## ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు

**నియోజకవర్గంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు**



కేదారిలంకలో రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా భారతీయుల మానసిక వికాస కేంద్రాలుగా ఖ్యాతినార్జిస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. కపిలేశ్వరపురం, మండపేట మండలాల్లోని పలు గ్రామాల్లో పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కేదారిలంకలో నూతనంగా నిర్మించిన శ్రీరాముని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పృథ్వీరాజ్, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు మేడిశెట్టి సత్యవేణి, ఉండమట్ల శ్రీనివాస్‌లకు సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. మండపేట పట్టణం రావులపేటలో రామాలయం శంకుస్థాపన మహోత్సవంలో తోట పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మండపేట మండలం ఇప్పనపాడులో రామాలయం ప్రతిష్ఠ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలకు రూ.పది లక్షల చొప్పున నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, తుపాకుల ప్రసన్నకుమార్, తిరుకుల శ్రీను, వనుం నారాయణ, గంగాధరం, బందెల సాయిరామ్, చంద్రమళ్ళ ప్రకాష్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వేగుళ్ళ ఆలయాల సందర్శన**

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కేదారిలంక గ్రామ శివారు శేరుగూడెంలో రామాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండపేట15 వ వార్డులోని సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజా కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌తో కలిసి హాజరయ్యారు. 21వ వార్డు రావులపేటలోని రామాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.

## సమన్వయంతో విజయవంతం చేయాలి

కోటిపల్లి (కె.గంగవరం): మహాశివరాత్రి ఉత్సవాల్లో తమకు అప్పగించిన పనిని బాధ్యతగా విధులు నిర్వహించి సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండల పరిధిలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద మార్చి 8న జరగబోయే మహాశివరాత్రిలో భక్తుల కోసం ప్రభుత్వం తరఫున అధికారులు చేసే ఏర్పాట్లపై సోమవారం సమీక్ష నిర్వహించారు. తొలుత ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ శాఖల వారీగా ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించారు. ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, రెవెన్యూ తదితర అధికారులు భక్తుల కోసం చేసే ఏర్పాట్లను ఎంపీ బోస్‌కు, ఆర్డీఓ సుధాసాగర్‌కు వివరించారు. బోస్ మాట్లాడుతూ ఏటా మహాశివరాత్రిన జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కోటిపల్లి గ్రామానికి తరలివస్తారని పూర్తి స్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం, రామచంద్రపురం, యానం తదితర ప్రాంతాల నుంచి కోటిపల్లి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహాశివరాత్రి రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పై అధికారులు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబి, దేవదాయ ధర్మాదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీరాంప్రసాద్, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ, ఈఓ శ్రీదేవి, గ్రామ పెద్దలు అయినవిల్లి అబ్బు, మండల స్థాయి అధికారులు, స్థానిక పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.